# మరాఠీ—గుజరాతీ దళిత సాహిత్యం

— కె. బాలగోపాల్

మరాఠీ, గుజరాత్ భాషలలోని దళిత సాహిత్యంమీద 'లోకాయన్' అనే సంస్థ డిసెంబర్ 12-13 లలో బొంబాయిలో ఒక సెమినార్ నిర్వహించింది.

మహారాష్ట్ర, గుజరాత్‌లనుండి ఆహ్వానించబడిన దాదాపు 30 మందిలో అధికంగా కవులే అయినా, ప్రజా ఉద్యమాలతో సంబంధం ఉన్న వ్యక్తులు, సాహిత్య విమర్శకులు, రాజకీయ కార్యకర్తలు, వున్నారు. ముఖ్యంగా గుజరాత్ నుండి వచ్చిన వారిలో చాలా వైవిధ్యం వుంది. 1974 లో ఇందిరా గాంధీని గడగడలాడించి ఎమర్జెన్సీకి ఒక ప్రత్యక్ష కారణమయిన 'నవనిర్మాణ్ సమితి' వుద్యమాన్ని నడిపిన వారిలో ఒకడయిన మనీషి జాని, ఒకప్పుడు గాంధీ వాదులుగా వుండి క్రమంగా గాంధీ వాదంపట్ల అసంతృప్తితో మార్క్సిస్టు అవగాహన తాలూకు కనీస సూత్రాలను ఆమోదించే స్థాయికి ఎదిగిన గిరిజన నాయకులు భాను భాయి అధ్వర్యు, అశోక్ చౌదరి, మార్క్సిస్టు సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ పునాలేకర్, అంబేద్కర్ అనుచరులయినప్పటికీ మార్క్సిజాన్ని ద్వేషించని వారు కొందరు వచ్చారు. మహారాష్ట్ర నుండి వచ్చిన వారిలో మాత్రం అధికభాగం మార్క్సిజాన్ని నిరసించే అంబేద్కర్ వాదులే.

సెమినార్ మొదటి నుండి చివరి వరకు అందరినీ వేధించిన సమస్య, అసలు దళిత సాహిత్యం అంటే ఏమిటన్నది. చారిత్రకంగా, దళిత సాహిత్యం అంబేద్కర్ చేత ప్రభావితులయిన హరిజనుల తిరుగుబాటు సాహిత్యంగా ముందుకు వచ్చింది [గాంధీ సృష్టించిన ఈ 'హరిజనులు' అనేమాటను వాళ్ళు అంగీకరించారు]. ఇప్పటికీ గూడ ఆ స్వభావం బలంగా వుంది. నాకు అర్థమయినంతవరకు ఆ సాహిత్యపు ప్రధాన వస్తువు అస్పృశ్యత, దానితోటి ఇతర హైందవ వర్ణ వ్యవస్థ తాలూకు ఉపలక్షణాలు. అయితే విమర్శకుల ధాటికి తట్టుకోలేక దళిత సాహిత్యకారులు మాట మాత్రంగా తాము 'దళితు' లన్నమాటను కేవలం పంచములకు పరిమితం చేయడం లేదని, ఆ మాటకు అర్థం 'పీడితు'లనీ, అనడం అలవర్చుకున్నారు. 'దళిత్' అంటే 'పీడితుడు' అన్నమాటవాస్తవమేగాని, దళిత సాహిత్యం మాత్రం పీడితుల వర్గసాహిత్యం కాదు, వారిలో (చాలవరకు) భాగమయిన 'అతిశూద్రుల' తిరుగుబాటు సాహిత్యం. (మాటలో మాట, హిందీలో తిరుగుబాటును 'విద్రోహం' అంటారు!)

నిలబడాలంటే వారికి విద్య చాలా అవసరమని గుర్తించాడు. గుర్తించి దళితులలో విద్యావ్యాప్తికి అపారమయిన కృషి చేసాడు. పెట్టుబడిదారీ పారిశ్రామికీకరణలో పట్టణాలకున్న స్థానం గ్రామాలకు లేదని గుర్తించి, దళిత యువకులను 'పట్టణాలకు తరలండి' అని ప్రోత్సహించాడు. బొంబాయి, పూనా వంటి నగరాలు పారిశ్రామిక కేంద్రాలు కావడంతో అంబేద్కర్ కృషి ఫలించి పారిశ్రామిక రంగంలోను, కొంత తక్కువ పరిమాణంలో పరిపాలనా యంత్రాంగంలోను, చాలా మంది దళితులు ప్రవేశించారు. దళితులమీద జరిగే అత్యాచారాలకు స్పందించి దళితుల నిరసనకు సాహిత్య రూపమిచ్చింది ఈ యువకులే. ఈ కారణంగానే, దళిత కవిత్వపు వస్తువులో గ్రామీణ ప్రాంతాలలో జరిగే అత్యాచారాలు ప్రధానమయినా, దాని దృక్పథం పట్టణ ప్రాంతపు మధ్యతరగతిది.

ఆ అత్యాచారాలు గూడ పేద రైతాంగం మీద, వ్యవసాయకూలీల మీద కాకుండా, దళితుల మీద జరగడానికొక కారణం వుంది. పశ్చిమ మహారాష్ట్ర చాలా సారవంతమయిన భూభాగం. అక్కడ చెరుకు పండించడం లాభసాటి వ్యాపారం. పైగా చెరకు పండించే రైతుల సహకార సంఘాలు బలంగా వుండడం చేత, ఆ సహకార సంఘాలే చెక్కెర ఫ్యాక్టరీలను నిర్వహించడం చేత, ఆ ప్రాంతంలోని ధనిక రైతాంగం నిజంగా చాలా ధనవంతమయినది. బంగళాలు, కార్లు వున్న 'రైతులు' గూడ వున్నారట. ఈ ధనిక రైతులలో అధికభాగం మరాతా కులానికి చెందిన వారు. ఇంతవరకూ ప్రత్యేకత ఏమీలేదుగాని, ఈ మరాతా కులానికున్న విశిష్టతే మహారాష్ట్రలో గ్రామీణ వర్గపోరాటానికి ప్రత్యేక స్వరూపాన్ని ఇస్తుంది. మరాతాలంతా నిజానికి ప్రాచీన కాలంలో ఒక కులం కాదు. ఛత్రపతి శివాజీ నడిపిన ముఘల్ వ్యతిరేక యుద్ధాలవల్ల ప్రేరితులై చాలా మంది శూద్రకులాలవారు తమదంతా ఒకే కులమనీ అది 'మరాఠీ' కులమని, ప్రకటించుకున్నారు. ఇవ్వాళ వీళ్ళ సంఖ్య మహారాష్ట్రలో 40 శాతం వుంది. పర్యవసానంగా, గ్రామీణ ప్రాంతాలలో ధనిక రైతులనుండి అతి పేద రైతుల వరకు మరాతాలు చాలామంది వున్నారు. ధనిక రైతులు అధికంగా హరిజనులయిన కూలీల మీద జరిపే అణచివేతలో, కుల ప్రాతిపదిక మీద మరాతా పేదరైతాంగం ధనిక రైతాంగంతో చేతులు కలిపింది. ఇది కేవలం పశ్చిమ మహారాష్ట్రకే కాకుండా, వెనుక బడ్డ ప్రాంతాలకు గూడ వ్యాపించింది. మరాఠ్వాడ విశ్వవిద్యాలయానికి అంబేద్కర్ పేరు పెట్టాలని దళితుల ఉద్యమం నడిపినప్పుడు వాళ్ళను

హింసాత్మకంగా ఎదుర్కొన్న వారిలో మరాఠా కులానికి చెందిన దిగువ మధ్య తరగతివారే అధికులు.

ఈ ప్రత్యేకమయిన కారణాలవల్ల మహారాష్ట్రలో తిరుగుబాటు సాహిత్యం దళితుల సవర్ణ వ్యతిరేక సాహిత్యం రూపం తీసుకుంది. 1950 లలో అన్నాభావుసాఠె, నారాయణ్ సూర్వె వంటి కమ్యూనిస్టు దళిత రచయితలు ఉండే వారట గాని, 1972 లో 'దళిత పాంథర్స్' ఏర్పడ్డ తరువాత మాత్రం దళిత సాహిత్యం పూర్తిగా కుల వ్యవస్థను లక్ష్యం ఎంచుకున్న సాహిత్యంగా మారింది. అయితే ఇది చాలా వాస్తవికమయిన వైరుధ్యం కావడంచేత, అత్యంత బలీయమయిన సాహిత్యాన్ని సృష్టించింది. మరాఠీ సాహిత్యంలో ఒక సంచల నాన్ని రేపి యావద్దేశం దృష్టినీ ఆకర్షించింది. శిష్ట సాహిత్యకారులు దళిత సాహి త్యాన్ని ఎదుర్కోవడానికి ఉపయోగించిన వాదనలన్నీ మనకు సుపరిచితమయినవే. అది ప్రచార సాహిత్యం అన్నారట. అందులో సార్వకాలిక విలువలు లేవన్నారట. సాహిత్య విలువలు లేవన్నారట. అది తిట్ల సాహిత్యం అన్నారట. భాషను నాశనం చేస్తున్నదన్నారట. లిఖిత భాషను మాత్రం నిజంగానే మార్చిందని సెమినార్‌కు వచ్చిన మరాఠీ దళిత కవులన్నారు అందరికంటే ఎక్కువగా బయటి ప్రాంతాలలో పరిచితుడయిన అరుణ్ కాంబ్లె, "దళిత సాహిత్యం మరాఠీ సాహి త్యాన్ని మాత్రమే కాదు. మరాఠీ నిఘంటువులను సయితం మార్చివేసింది" అని సగర్వంగా అన్నాడు. ఇప్పుడు దళిత సాహిత్యం ఎంతగా విస్తరించిందంటే దాన్ని పాఠ్యపుస్తకాలలో సయితం ప్రవేశపెట్టారట. దళిత సాహిత్యం వస్తువుకే తప్ప శైలికి ప్రాధాన్యత నివ్వడంలేదనే వాదానికి సమాధానంగా పూనా యూనివర్సిటీకి చెందిన విమర్శకుడు ప్రొఫెసర్ ఫడ్కే, "అనుభవం అభివ్యక్తిని నిర్ణయిస్తుంది" అన్నది దళిత సాహిత్య సిద్ధాంతంగా తీర్మానించాడు.

దళిత సాహిత్యానికి తోడుగా నిలిచింది 'దళిత రంగభూమి' అనే నాటక ఉద్యమం. వీళ్ళు వీధినాటకాల ప్రక్రియను విస్తృతంగా వాడతారట. మరాఠ్వాడా ప్రాంతంలో ఈ రంగభూమి ఎంత ప్రజాదరణ పొందిందంటే, వాళ్ళు నాటక పోటీలలోగాని ప్రవేశం కోరితే, నాటిక మరీ పెద్దదనో, మరీ చిన్నదనో ఏదో ఒక కుంటిసాకు చూపి ప్రవేశం నిరాకరిస్తారట.

ఇక్కడ విప్లవ సాహిత్యోద్యమంలో భాషనుగురించి, శైలినిగురించి, వస్తున్న చర్చలే అక్కడ దళిత సాహిత్యంలోను వస్తున్నాయి. అయితే అవి

ఇంకా చాలా ప్రాథమిక మయిన దశలో వున్నాయి. ఉదాహరణకు, భాషకు సంబంధించి సెమినార్‌లో వచ్చిన చర్చ మాండలికాలగురించి కాదు, 'శిష్ట వ్యావహారికమా' లేక సామాన్య ప్రజల భాషా అన్నది. ఇంతవరకు దళిత సాహిత్యం సంస్కృతం నిండిన 'శిష్ట వ్యావహారికాన్ని' వాడుతూ వస్తోందని కొంద రన్నారు.

"మనం బ్రాహ్మణమతాన్ని సంస్కృతంలో తిడుతున్నాం" అని ఒక రచయిత అన్నాడు. అయితే చర్చ అంత ఆసక్తికరంగా సాగలేదు — 'శిష్టవ్యావహారికం' లో రాయడం తప్పు కాదని అధికుల అభిప్రాయం కావడంవల్ల కాబోలు. దళిత సాహిత్య ఉద్యమపు మధ్యతరగతి స్వభావానికి, దానికి ప్రజా పునాది లేక పోవడానికి, ఇది ఒక సంకేతం.

గుజరాత్‌కు దళిత సాహిత్య ఉద్యమం మహారాష్ట్రనుండి వలస వెళ్ళింది. అంబేద్కర్ చనిపోయినప్పుడు ఎవ్వరి ప్రోద్బలం లేకుండ గుజరాత్ పట్టణాలలోని హరిజన గల్లీలలో వందలకొద్దీ కవులు కవితలు రాసారట. అయితే గుజరాతీ దళిత కవులలో అంబేద్కర్‌పట్ల వ్యక్తి పూజాభావం కనిపించదు. వారిలో ఒకరు తన మరాఠీ సోదరుల నుద్దేశించి "మనం రాముడిని కృష్ణుడిని కాదని వాళ్ళ స్థానంలో అంబేద్కర్‌ను నిలబెడుతున్నాం" అని ఆరోపించాడు. దానితోబాటే వారిలో మార్క్సిస్టు వ్యతిరేకత గూడా ఎక్కువ కనిపించలేదు. గుజరాతీ దళిత సాహిత్యానికి వేదికగా వున్న 'ఆక్రోశ్' పత్రిక నిర్వాహకులలో ఒకడయిన మనీషి జానీ మహారాష్ట్ర దళిత సాహిత్యకారుల నుద్దేశించి; దళిత సాహిత్య ఉద్యమం ఒక రాజకీయ లక్ష్యంగాని శాస్త్రీయమయిన సిద్ధాంతంగాని లేకుండ ఎంతకాలం నిలవ గలదని పదే పదే ప్రశ్నించాడు. ఆంధ్రలో దళితులకున్న ప్రత్యేక సమస్యల వ్యక్తీకరణగూడ స్పష్టమయిన వర్గచైతన్యంగల కవిత్వంలోనే జరిగిన తీరును వివరించినప్పుడు గుజరాత్ దళిత సాహిత్యకారులు చాలా ఆసక్తి కనబరిచారు. మరాఠీ కవులుమాత్రం పెద్దగా పట్టించుకోలేదు. అయితే దీనికి కేవలం అంబేద్కర్ వాదాన్ని తిడితే లాభంలేదు. మన (అంటే కమ్యూనిస్టుల) తప్పులనుగూడ మనం గుర్తించాలి. దళితులకు, స్త్రీలకు, ఇతర సెక్షన్లకు వున్న ప్రత్యేకమయిన సమస్యలను విస్మరించడం, సోషలిజం సాధించిన తరువాతనో లేక (ఇంకొంచెం 'రాడికల్' అయితే) పోరాటక్రమంలో పాల్గొంటేనో ఆ సమస్యలు పరిష్కార మవుతా యని ప్రకటించడం వదిలిపెట్టి, వర్గపోరాట దృక్పథంతోనే ఆ సమస్యల వ్యక్తీకరణకోసం, పరిష్కారంకోసం, ఇప్పటికి జరిగిన దానికంటె ఎక్కువగా కృషి

చేయాల్సివుంది. ఆ పని చేసినంత మేరకే అంబేద్కర్ వాదాన్ని 'ఫెమినిస్టు' (మహిళా) వాదాలను దూరంగా వుంచగలుగుతాం (ఇక్కడ ఫెమినిజం ప్రసక్తి ఎందుకంటే, సెమినార్‌కు సోనాల్ శుక్ల అనే ఒక 'ఫెమినిస్టు' కార్యకర్త గూడ వచ్చారు. ఆమె స్త్రీలను గూడ దళితులగా పరిగణించాలని, దళిత సాహిత్యం వచ్చినట్లే స్త్రీల సాహిత్యం గూడ రావాలని, అట్లా రాకపోవడానికి అన్ని రంగాల లోని పురుషాధిక్యతే కారణమనీ అన్నారు.)

గుజరాత్ దళిత సాహిత్యం ఇప్పు డిప్పుడే ఎదుగుతూన్నట్టుంది. మొదట్లో వైయక్తిక ఉద్యమంగా ప్రారంభ మయిందట. అందుకు సంకేతంగా ఆ సాహిత్యం ప్రథమవేదిక 'నేను' అనే పత్రిక. అయితే 1977 లో 'విశ్వశాంతి' కోసం కొందరు పెద్దమనుషులు యజ్ఞం చేయించినప్పుడు దాన్ని విమర్శిస్తూ, 'రంగ్‌లో లంగ్‌టీ' అనే ప్రజావాణిలో వీధినాటకం తయారుచేసి అహమ్మదాబాద్‌లో ప్రదర్శించినప్పుడు కార్మిక వాడలలో లభించిన ఆదరణ, 'నవనిర్మాణ్' ఉద్యమం ఇచ్చిన ఉత్తేజం, ఆవైయక్తిక జాడ్యాన్ని పోగొట్టి నిజమయిన ఉద్యమంగా మార్చాయి. మొన్న అహ్మదాబాద్‌వంటి నగరాలలో 'రిజర్వేషన్' వ్యతిరేక కల్లోలం చెలరేగి నప్పుడు దాన్ని ప్రతిఘటిస్తూ దళితకవులు కవిత్వం రాసారు. అప్పుడు వారిమీద పోలీసులు జరిపినదాడి, వారి పత్రిక 'ఆక్రోశ్' మీద ప్రభుత్వ నిషేధం, మొదటి సారిగా గుజరాతీ దళిత సాహిత్యం వైపు దేశం దృష్టిని ఆకర్షించాయి.

ఆ రిజర్వేషన్ వ్యతిరేక ఉన్మాదానికి గల సామాజిక నేపథ్యాన్ని గూడ సెమినార్‌లో చర్చించడం జరిగింది. ఆ ఉద్యమాన్ని నడిపింది అధికంగా పటేల్ కులానికి చెందినవారు. ఈ పటేళ్ళు భూస్వామ్య ధనిక రైతాంగ వర్గాలకు చెందిన వారు (కాంగ్రెస్ రాజకీయాలలో గూడ గుజరాత్‌కు చెందిన సర్దార్ వల్లభాయిపటేల్ అందరికంటే బాహాటంగా భూస్వాముల పక్షం తీసుకున్న విషయం తెలిసిందే) ఉద్యమానికి ఎక్కువగా గురయింది దళితులలో వణ్కర్ కులానికి చెందినవారు. ఈ వణ్కర్‌లు సాంప్రదాయికంగా నేత పనివారు (నేత పనివారు అస్పృశ్యులు కావ డం బహుశా గుజరాత్‌లో మాత్రమే వుందేమో. తెలుగులో 'సాలెనేత, మాలనేత' అనే మాటలనుబట్టి మాలలు నేతపని చేసేవారని తీర్మానించవచ్చు.) అహ్మదా బాద్‌లో వస్త్రపరిశ్రమ నెలకొన్న తరువాత ఈ వణ్కర్‌లు ఆ పరిశ్రమలో కార్మి కులుగా స్థిరపడ్డారు. ఆ పట్టణం వస్త్రోత్పత్తికి ఒక ప్రధాన కేంద్రంగా రూపొంద డంతో వణ్కర్‌లలో కొందరు క్రమంగా దిగువ మధ్యతరగతిలోకి ప్రవేశించి ప్రభు

త్వోద్యోగాల కోసం పటేళ్ళతో పోటీకి దిగారు. దానితో పటేళ్ళకు హఠాత్తుగా దేశంలో 'నిపుణత' కు స్థానం లేకుండా పోతోందని గుర్తుకొచ్చి దేశాన్ని ఉద్ధరించడానికి ఉద్యమం లేవనెత్తారు. ఉద్యమం వల్ల అధికంగా దెబ్బతిన్నది వణ్కార్ లే. దళితులందరిలోనికి తక్కువకులం వారయిన భంగీలు పటేళ్ళతో పోటీ పడకపోవడం వలన వాళ్ళను ఉద్యమం ఏరకంగానూ తాకలేదు. భంగీలు వీధులు మరుగుదొడ్లు శుభ్రపరిచే పనిచేస్తారు. (హైదరాబాద్ లో గూడ పాతవాడల్లో మరుగుదొడ్లు శుభ్రపరిచే వాళ్ళలో గుజరాతీ భంగీ స్త్రీలు చాలామంది వున్నారు.) మరి వణ్కార్లతో సాటిదళితులైన భంగీలు చేతులెందుకు కలపలేదని ప్రశ్నించగా "దానికి మా తప్పుగూడ చాలావుంది" అని వణ్కార్ కులానికి చెందిన పరార్ అనే దళిత కవి అన్నాడు. భంగీలను దళితులలో దళితులుగా తమ కులంవాళ్ళు చూడడం కద్దని అన్నాడు. అంతేకాకుండ మనదేశ అర్థ భూస్వామ్య సమాజానికి సంకేతంగా భంగీలకూ పటేళ్ళకూ మధ్యవున్న ఫ్యూడల్ సంబంధంగూడ దీనికి తోడ్పడింది. పల్లె ప్రాంతాలలో ఇప్పటికీ గూడ భంగీలు ఒకపూటే ఇంట్లో వండుకుంటారట. రెండవపూట దొర (సామాన్యంగా పటేల్ కులానికి చెందిన భూస్వామి) ఇంటికి పోయి పాచిపనులు చేసి తిండితిని వస్తారట. ఈ సంబంధాన్ని తెంపుకోవడం ఇద్దరికీ ఇష్టంలేదు. మొత్తం మీద 'రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం' 'వర్ణసంఘర్షణ' కాదని, చాల సంక్లిష్టమయిన వర్గసంఘర్షణ అని బయటపడింది.

మళ్ళీ సాహిత్యం దగ్గరికొస్తే మరాఠీ దళిత సాహిత్యం భవిష్యత్తు దళిత్ పాంథర్ల చేతుల్లో లేదనిపిస్తుంది. అంబేద్కర్ పట్ల వారికున్న వ్యక్తి పూజా భావం, శాస్త్రీయ సోషలిజంపట్ల వారి వ్యతిరేకత (అర్జున్ డాంగ్దె అనే దళిత్ పాంథర్ నాయకుడు "మార్క్సిస్టులు చెప్పే వర్గపోరాటం మనదేశంలోనే లేదు" అని ప్రకటించాడు), అన్నిటికంటే ముఖ్యంగా వారి ఇందిరా కాంగ్రెస్ రాజకీయాలు, పెద్ద అపరోధాలు. బహూశా దళితులలోనే కొత్తతరం రావాలి, లేదా కమ్యూనిస్టులమని చెప్పుకుంటున్నవాళ్ళు తమ కలవాటయిపోయిన సైద్ధాంతిక సంకుచితత్వాన్ని విడిచిపెట్టి మహారాష్ట్రలోని ప్రత్యేక పరిస్థితులను అధ్యయనం చేసి దళితులను ఆకర్షించ గలగాలి. గుజరాత్ లో మాత్రం ఇప్పటి దళిత రచయితలకే మంచి భవిష్యత్తు ఉందనిపిస్తుంది. ఇంగ్లీష్ లో గూడా రాయడం ద్వారా బయటి ప్రపంచానికి పరిచితుడయిన వీరప్ పటేల్ కవితలలో వ్యక్తిగత ఆవేదనే ఎక్కువ కనబడే మాట వాస్తవమే, కాని ఇతర రచయితలలో మరింత విశాలమయిన స్పందన ఉన్నట్లనిపిస్తుంది.